విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో ఇసుక అక్రమంగా రవాణా కాకుండా నిరోధించాలన్నారు. ఇసుక రీచ్‌ల్లో గట్టి నిఘా ఉంచి అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీకె. బాలాజీ హెచ్చరించారు. నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఉదయం ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల్లో 26 ప్రదేశాల్లో సీసీ టీవీలను అమర్చేందుకు రూట్‌మ్యాప్ సిద్ధంచేసి అందజేయాలన్నారు. మద్దూరులో సీజ్ చేసిన 1500 టన్నుల ఇసుక బయటకు తరలిపోకుండా ఎస్ఈబి అధికారులు అక్కడ సీసీటీవీలను అమర్చి సంబంధిత బిల్లును చెల్లింపుకోసం అందజేయాలన్నారు. అనుమతి లభించిన 8 ఇసుక రీచ్‌లలో రానున్న వర్షా కాలంలో మాన్యువల్ గా ఇసుక తీసుకోవడానికి గాని లేదా కన్వేయర్ బెల్ట్ ద్వారా టిప్పర్లలోకి లోడింగ్ చేయడానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి అందచేయాలన్నారు. కొత్తగా గుర్తించిన 5 రీచ్‌ల్లో 14 లక్షల టన్నుల వరకు ఇసుక ఉండే అవకాశం ఉందని, సెమి మెకనైజ్డ్ ఇసుక తవ్వడానికి గనులు, జలవనరులు, రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్ ఇబి భూగర్భజల శాఖల అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేసి ప్రజల అభిప్రాయంతో పాటు పూర్తి సిఫారులతో వచ్చే సమావేశానికి నివేదిక తీసుకురావాలన్నారు. 9వ తేదీన మరల సమీక్ష సమావేశం నిర్వహిస్తామని,పూర్తి స్థాయిలో నివేదికలు అందచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి కొండారెడ్డి, ఎస్ ఈబి సూపరింటెండెంట్లు జి. గంగాధర రావు, పాండురంగారావు, ఇన్‌స్పెక్టర్లు వెంకటలక్ష్మీ, శివరామరాజు, హేమ, సుస్మిత, డిపిఒ నాగేశ్వర్ నాయక్, కాలుష్యనియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి. శ్రీనివాస రావు, భూగర్భజల శాఖ అధికారి విజయ వర్ధనరావు, జలవనరుల శాఖ ఈ కృష్ణారావు, ఎంవిఐ స్వర్ణ శ్రీనివాసు, ఎస్వీఎన్విరో ల్యాబ్స్ కన్సల్టెంట్లు సునీల్, కృష్ణ అధికారులు పాల్గొన్నారు.

బత్తుల మృతికి సంతాపం

విశాలాంధ్ర-గన్నవరం : బత్తుల వెంకటేశ్వరరావు అకాల మృతి సీపీఐకి తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, గన్నవరం కార్యదర్శి పెద్దు వాసుదేవరావు అన్నారు. గన్నవరం సీపీఐ కార్యాలయంలో బుధవారం వెంకటేశ్వరరావు అకాలమృతికి సీపీఐ గన్నవరం కార్యవర్గం సంతాపం తెలిపి, వారి కుటంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణ జిల్లాలో నాయకుడుగా అగ్రనాయకులతో కలసి భూ పోరాటాలు చేసారని తెలిపారు.

సంక్షోభంలో చేనేత పరిశ్రమ

చేనేత సంఘాల వెతలు రాయితీ ఊసెత్తని పాలకులు
బకాయిలతో ఐదేళ్లుగా ఇబ్బందులు
పడుతున్న చేనేత సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. అనేక చేనేత సంఘాలు నష్టాల ఊబిలో కూరుకుని, బయటపడే స్థితి కనిపించకుండా పోయింది. అనేక మంది కార్మికులు ఉపాది లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. చేనేత సంఘాలకు ప్రతి ఏటా నాబార్డు ఆధ్వర్యంలో కేడీసీసీ బ్యాంకు వారు పెట్టుబడుల కోసం రుణాలు మంజూరు చేస్తారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలోని అన్ని సంఘాలకు కలిపి 2024-25 సంవత్సరానికి రూ.11.17 కోట్ల రుణాల మంజూరుకు చర్యలు తీసుకున్నారు. ఆయా సంఘాలకు రావలసిన వస్త్ర రాయితీ గత ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వడ్డీలు కట్టలేక సంఘాల ప్రతినిధులు ఆందోళన పడుతున్నారు. వస్త్ర ఉత్పత్తికి సంబందించి సంఘాల వస్త్ర ఉత్పత్తి సామర్ధ్యాన్నిబట్టి పెట్టుబడికోసం కెడిసిసి బ్యాంకు రుణాలను మంజూరు చేస్తుంది. నాటి వైకాపా ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో ఉన్న వాటిలో అక్కడక్కడ ఒకటి, రెండు సంఘాలు మినహా మిగిలిన సంఘాలన్నీ నష్టాల్లో కూరుకుపోయాయి. ఉత్పత్తి చేసి విక్రయించిన వస్త్రాలపై ఇచ్చే రాయితీని గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ప్రస్తుతం చేసిన ప్రతిపాదనల ప్రకారం గూడూరు మండలం పోలవరంలోని శ్యామ్ ప్రసాద్ చేనేత సహకార సంఘానికి రూ. 1.09 కోట్లు రుణం అందాల్సి ఉండగా, ప్రభుత్వం నుండి రావాల్సిన వస్త్ర రాయితీ రూ.88 లక్షలు ఉంది. రెండు వర్గాల్లోని అన్ని సంఘాలకు కలిపి వస్త్ర రాయితీ బకాయిలు దాదాపు రూ. 10 కోట్ల వరకు ఉన్నాయి. సకాలంలో నిధులు విడుదల చేస్తే తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తామని, ప్రస్తుతం ఆ పరిస్తితి లేకపోవడంతో వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చేనేత కార్మికులు వాపోతున్నారు.

పెరుకుపోయిన బకాయిలు

చేనేత కార్మికులు ఏడాదికి ఒక్కొక్కరు 30 నుంచి 60 సాగలు నేస్తారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం బకాయిలు కూడా కోట్ల రూపాయల్లో చెల్లించాల్సి ఉంది. సాగలు ద్వారా కార్మికులు పొందే వేతనం నుంచి 8 శాతం వసూలు చేస్తారు. దానికి ప్రభుత్వం 14 శాతం కలిపి కార్మికులకు ఇవ్వాలి. నేత వస్త్రాలకు వినియోగించే నూలు కొనుగోళ్లలో 40 శాతం రాయితీ ఇస్తారు. సంఘాలు ముందు కొనుగోలు చేస్తే తిరిగి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. ఇలా వివిధ పథకాల బకాయిలు అన్నీ పేరుకుపోయాయి. ఒక్కో సంఘానికి రూ.50 లక్షల నుంచి రూ. 2 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల పెడన, గూడూరు మండలాల్లో పర్యటించిన చేనేత జౌళి శాఖ మంత్రి సవిత దృష్టికి తెచ్చారు. చేనేత పరిశ్రమ అభివృద్ధి చేయడంతో పాటు కార్మికులను అన్ని విదాలుగా ఆదుకుంటామని చెప్పడంతో నేతన్నలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

రుణాల పంపిణీకి చర్యలు తీసుకుంటాం

జిల్లా చేనేత,జౌళి శాఖ అధికారి రఘునంద

చేనేత సంఘాల వారికి వస్త్ర రాయితీతో పాటు ఇతర బకాయిలు గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేనని రఘునంద అన్నారు. సంఘాల వారీగా ఋణాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ పథకాల వారీగా విడుదల చేయాల్సిన బయాయిలపై ప్రభుత్వానికి నివేధించామని, దీనిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉందని, త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. చేనేత సంఘాల ప్రతినిధులు, కార్మికులు ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి రఘునంద తెలిపారు.

మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : పోతేపల్లి జ్యువెలరీ పార్క్‌లో మంగళవారం బిగ్ టీవీ మరియు మానవత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వైద్యుల బృందంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా బిగ్ టీవీ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఉచిత మెగా మెడికల్ క్యాంపులు అభినందనీయమని, ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించుటకు మీడియా సంస్థలు మరిన్ని ముందుకు రావాలన్నారు. నేటి ఆహారపు అలవాట్లు, కాలుష్య వాతావరణం తదితర కారణాలతో రోగాల బారిన పడుతున్న అనేకమంది ఆసుపత్రుల్లో ఎంతో వ్యయం చేయవలసిన పరిస్థితులు ఉన్నందువలన పేదలకు వైద్య సేవలు ఉచితంగా అందించడానికి ఈ కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. మంచి ఆహారపు అలవాట్లు,యోగా ప్రయోజనాలు పట్ల అవగాహన కల్పించేందుకు బందరులో వివిధ అసోసియేషన్ల సహకారం తో సామాజిక సేవా దృక్పదంతో చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సేవలు పొందిన రోగులకు మంత్రి మందులు అందజేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద భీమా పద్ధతిలో రూ. 25 లక్షల వరకు వైద్యం అందించే పాలసీ త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటిచనున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 100 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు, అందులో భాగంగా మచిలీపట్నం బైపాస్ రోడ్‌లో అన్న క్యాంటిన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 10 వైద్య విభాగాల్లో స్పెషలిస్ట్ వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు అధ్యక్షత వహించారు. మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీరామ్, బిగ్ టీవీ ప్రతినిధి శివ, పార్లమెంట్ మాజీ సభ్యులు కొనకళ్ళ నారాయణ రావు పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా మద్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఉదయం మధ్యాహ్న భోజన పథకం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లాకలెక్టర్ బాలాజీ నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డించాలన్నారు. పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరగాలని, వారి హాజరు పెరగాలని, బాలబాలికల మధ్య లింగ బేధం తగ్గించాలని, సామాజికంగా సమానత్వం పాటించాలని, పోషకాహార లోపాన్ని తగ్గించాలనే ప్రధాన ఉద్దేశ్యలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. జిల్లాలో కొన్ని పాఠశాలలను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా భుజించి అంతా బాగుందన్నారు.భోజనం సరిగా వండకపోతే నిబంధనల ప్రకారం త్రిసభ్య విద్యా కమిటీ విచారణ జరిపి వంట ఏజెన్సీని మార్చడం జరుగుతుందన్నారు. పెడన పాఠశాలను తనిఖీ చేసి వాస్తవాన్ని గుర్తించి వంట ఏజెన్సీలకు నోటీసులు జారీ చేశామని డిఈఓ తహేరా సుల్తానా జిల్లా కలెక్టర్ కు వివరించారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం లావుగా ఉండడంతో విద్యార్థులు ఇష్టపడడం లేదని, బిపిటి వంటి సన్న బియ్యం పై ఆశక్తి చూపుతున్నారన్నారు. విద్యార్థులకు చిక్కీలు, కోడిగుడ్డు, నిర్ణిత ప్రమాణాల్లో అందజేస్తున్నదీ, వంట ఏజెన్సీలకు సకాలంలో చెల్లింపులు జరుగుతున్నాయా లేదా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, డిఈఓ తహేరా సుల్తానా, జడ్పీసీఈఓ ఆనంద్ కుమార్, డీఎస్ఓ పార్వతీ, పౌరసరఫరాల సంస్థ డిఎం. సతీష్, సర్వశిక్ష ఏపీసి శ్రీరాములు నాయక్, బీసీ సంక్షేమ అధికారి రమేష్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేకాట, గంజాయిపై ఉక్కుపాదం

విశాలాంధ్ర-అవనిగడ్డ : స్టేషన్ పరిధిలో అసాంఘీక కార్యక్రమాలు నిర్వహించకుండా ఉక్కు పాదం మోపుతామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె శ్రీనివాస్ అన్నారు. బదిలీలలో భాగంగా మచిలీపట్నం దిశా పోలీస్ స్టేషన్ నుండి అవనిగడ్డ ఎస్ఐగా బదిలీపై వచ్చిన కె శ్రీనివాస్ మంగళవారం భాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని, అసాంఘీక కార్యక్రమాలు నిర్వహించేవారిపై ఉక్కుపాదం మోపుతానని, ప్రత్యేకించి ట్రాఫిక్‌పై కూడా దృష్టి పెడతానన్నారు. భాధ్యతలు తీసుకోకముందు మోపిదేవిలో వేంచ్చేసి ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే గత 30 సంవత్సరాలుగా అవనిగడ్డలో ఒక పర్యాయం చేసి వెళ్ళిన ఎస్ఐ రెండవ సారి రావడం ఇదే మొట్ట మొదటి సారి.

కూచిపూడిలో ఏఎస్పీ వెంకటేశ్వరరావు పర్యటన

విశాలాంధ్ర-కూచిపూడి : నాట్య క్షేత్రమైన కూచిపూడిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠాన్ని కృష్ణాజిల్లా ఏఎస్పీ జి వెంకటేశ్వరరావు దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరి గ్రంథాలయ పాలకులు వై.వి. ఫణి కుమార్ నాటి నేటికూచిపూడి నాట్యాచార్యుల జీవిత విశేషాలను, కళా పీఠంలో కొనసాగే కోర్సులు వివరాలు సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో 2008లో కూచిపూడి నాట్యోత్సవాలో పాల్గొనటానికి కళాపీఠానికి విచ్చేశానని పేర్కొంటూ ఆనాటి స్మృతులను గుర్తుకు తెచ్చుకొంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నాట్యాచార్యుల ఇలవేల్పైన బాలాత్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. దేవాలయ పాలకమండలి అధ్యక్షులు కాపూరి భానుమూర్తి పర్యవేక్షణలో శేష వస్త్రాలను అందజేశారు.

సీపీఐ సానుభూతిపరురాలు లక్ష్మీకాంతం మృతి

విశాలాంధ్ర-కూచిపూడి : కాజలో చేనేత కార్మిక కుటుంబానికి చెందిన సీపీఐ సానుభూతిపరురాలు, సీపీఐ సభ్యుడు నందం ఘంటయ్య భార్య లక్ష్మీకాంతం (76) సోమవారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంగా ఉంటున్న ఆమె వైద్య చికిత్సలు పొందుతూ చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త చేనేత కార్మికుడు, సీపీఐ సభ్యుడు ఘంటయ్య కు అండదండలుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు మనుమలు మనుమరాళ్ళు ఉన్నారు. ఈమె మృతికి సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కోసూరు వెంకట అప్పారావు, కృష్ణా జిల్లా చేనేత కార్మిక సంఘ అధ్యక్షులు, సీపీఐ పామర్రు నియోజకవర్గ సమితి ప్రత్యేక ఆహ్వానితులు కోదాటినారాయణరావు, కూచిపూడి శాఖ కార్యదర్శి కొండా నాగేశ్వరరావు, చేనేత కార్మికులుచిరందాసు సత్యనారాయణ,పంచల రామమోహనరావు, కోదాటి కనకదుర్గారావు, కోదాటి ఈశ్వర ప్రసాద్, కోదాటి వెంకటేశ్వరరావు నివాళులర్పించి మృతదేహంపై పూలదండలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

నూతన భవనాలు నిర్మిస్తాం : ఎమ్మెల్యే మండలి

విశాలాంధ్ర-ఘంటసాల: ఘంటసాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళ వారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంజూరైన ఈ పాలిటెక్నిక్ కళాశాలను అప్పట్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో ఏర్పాటు చేయగా, ఆ భవనాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మించాలని కోరగా రూ. 11 లక్షలతో ప్రహరీ నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. మండలి వెంకట్రామ్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, తుమ్మల చౌదరిబాబు, మండల పార్టీ సెక్రటరీ పరిచే చలపతిరావు, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, ప్రిన్సిపాల్ సత్య ప్రియ లలిత, అధ్యాపకులు లహరి, పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలో రోజు రోజుకీ పెరుగుతున్న వైరల్ జ్వరాలను దృష్టిలో ఉంచుకుని అధికారుల ఆదేశాలతో మంగళవారం యద్దనపూడిలో పంచాయతీ కార్యదర్శి లోయవెంకటనాగకళావతి దోమల నిర్మూలన మందు ఎబిట్‌ను స్ప్రే చేయించారు. పెదపూడి సచివాలయం ఏఎన్ఎం కే బుజ్జి ఆధ్వర్యంలో బ్లీచింగ్ సున్నం చల్లించారు. ఈ కార్యక్రమాలను సర్పంచ్ ఒక బాలకృష్ణ పర్యవేక్షించారు.

గన్నవరంలో దేశభక్తి, సమైక్యతకు పరుగులు

విశాలాంధ్ర-గన్నవరం : దేశ సమగ్రతను పెంపోందించుట కొరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్వాగతం పలుకుతూ హెచ్. సి.యల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులతో ఐక్యత కోసం పరుగుల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం మోహిని కృష్ణ కుమారి పరుగుల జాతీయ జెండా ఊపి ప్రారంభించగా విద్యార్థులు అందరూ జాతీయ జెండాలను చేత బూని భారత మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. స్పోర్ట్స్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ బొమ్మిశెట్టి సత్యనారాయణ రావు మాట్లాడుతూ "క్రీడల కొరకు మార్పు" అనే నినాదం తో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా ఉపాధ్యాయురాలు మాలతి,వ్యాయామ ఉపాధ్యాయులు మీరా సాహెబ్, జనంజన రాజు, గోపి తదితరులు హాజరైనారు.

రసాయన మందుల వాడకం తగ్గించాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: రైతులు తమ పంట పొలాల్లో విచ్చలవిడిగా రసాయన ఎరువులు మందులు ఉపయోగించరాదని చిట్టచివరి అస్త్రంగానే వాటి ఉపయోగించాలని కేంద్ర మొక్కల సంరక్షణ ఉద్యాన మరియు వ్యవసాయ శాఖాధికారి బొల్లి వేణు బాబు అన్నారు. మంగళవారం మేడూరు, కృష్ణాపురం గ్రామాల్లోని రైతులకు కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ, వ్యవసాయ శాఖ సంయుక్త గా రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. పంట పై జీవ సంబంధ చీడపీడలు నాశన కారులైన ట్రీక్గ్రామ్ మరియు లింగార్షక బుట్టలు, వివిధ రకాల పురుగుల నివారణకు జిగురు రంగు అట్టలని వాడటం ద్వారా పంటలను సంరక్షించుకోవచ్చున్నారు.జీవ శీలింద్ర నాశిని ఉపయోగించటం వలన ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వారి వారి పొలాల్లో చీడపీడలు త్వరితగతిన గుర్తించి వాటి నివారణకు సత్వర చర్యలు, సలహాలు కు డిసిపి క్యూ ఎస్ వారు రూపొందించిన ఎన్.పి.ఎస్.ఎస్.(నేషనల్ పెస్ట్ సర్వైవెన్స్ సిస్టం) అనే చరవాణి అనువర్తనం ఎన్పిఎస్స్ యాప్ అందుబాటులో తెచ్చారని దీనిని రైతులు ఉపయోగించు కోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు టి.ప్రేమ్ రంజిత్, సురేష్ స్థానిక ఎ.ఓ.గణేష్ రెడ్డి వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఆరుగురు యువకుల అరెస్ట్

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరుగురు గంజాయి సేవిస్తున్న యువకులను మంగళవారం అరెస్ట్ చేసి వారి నుంచి 1.7 కిలోల గంజాయి, 10 మద్యం సీసాలు, రెండు మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ టి శ్రీనివాస్ తెలిపారు. ఆ యువకు లైన మురారి పవన్‌కుమార్ (19, వేములమడ) పాలన రాహుల్ (19, మొవ్వ) గుమ్మడి ఆనంద్ బసవేశ్వర్ (24, కొడాలి), మోటుపల్లి సునీల్ (22,కొడాలి), గుడపర్తి కిరణ్ (28 బేతవోలు,గుడివాడ) కాసాని జ్ఞానశాయి (21, వేములమడ) లకు చెందిన ఆరుగురు యువకులు కూచిపూడి నుంచి రహదారిలో గల ఖాళీ వెంచర్లో గంజాయి సేవిస్తున్నారు. సమాచారం తెలుసుకొని వారిని అదుపులోకి తీసుకోగాఆ గంజాయిని వారు సీలేరు లోని ఒక వ్యక్తి నుంచి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారని పోలీసులు తెలిపారు వారిని ఎన్ డి పి ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్కు

త్వరలోనే గుడివాడ-కంకిపాడు రోడ్డు అభివృద్ధి : ఎమ్మెల్యే వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ కంకిపాడు రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలోని ప్రజావేదికలో ఆర్అండ్‌బి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌అండ్‌బి అధికారలతో సమావేశంలో అయన మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారుల్లో ఉన్న గుంటలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో వివిధ రహదారుల అభివృద్ధి, మరమ్మత్తులు చేయాలన్నారు. ప్రతేకంగా ఏఎన్ఆర్ కళాశాల నుండి వెంట్రప్రగడ వరకు ఐదు కోట్ల నిధులతో రివిట్ మెంట్‌తో సహా రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. వెంట్ర ప్రగడ నుండి నందమూరు వరకు రహదారి మరమ్మతులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి ఎన్ఆర్‌జిఎస్ నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రధాన రహదారులను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకూడదనే ప్రధాన రహదారుల్లో గోతులను పూడుస్తు చిన్నపాటి మరమ్మత్తులు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుడివాడ బైపాస్ రోడ్డును నేషనల్ హైవేలో విలీనం చేయాలని ప్రతిపాదనలు రూపొందించామని, కేంద్రమంత్రి గడ్కరీ విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన వెంటనే ఎంపి వల్లభనేని బాలసౌరి సహకారంతో రహదారి విలీన ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు,ఆర్ అండ్ బి శాఖ ఇఇ శ్రీనివాసరావు, డిఇ కామేశ్వరరావు, పలువురు ఎఇ లు పాల్గొన్నారు.

గన్నవరం తహసీల్దార్‌గా శివయ్య

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం తహసిల్దార్ గా కె వి శివయ్య బుధవారం పద్యతలు స్వకరీంచారు. గన్నవరం తహసీల్దార్ పవన్ కుమార్ పశ్చామ గోదావరి బదిలీ కాగా అక్కడనుండి కె వి శివయ్య గన్నవరం బదిలీ మీద వచ్చారు.

గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐగా ప్రసాదరావు

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ ట్రాఫిక్ ఎస్.ఐ ప్రసాదరావు భాధ్యతలు స్వీకరించారు. మంగళవారం స్థానిక డియస్‌పి కార్యాలయంలో ఈ మేరకు ట్రాఫిక్ ఎస్.ఐగా ప్రసాదరావు భాధ్యలు స్వీకరించిన అనతరం గుడివాడ డియస్‌పి శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

కూచిపూడి హెడ్ కానిస్టేబుల్ బదిలీ

విశాలాంధ్ర-కూచిపూడి : హెడ్‌కాని స్టేబుల్ సయ్యద్ ఆలి బదిలీ అయ్యారు. 2019లో కూచిపూడి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఆలీ ఐదేళ్ళు పూర్తవడంతో కృష్ణాజిల్లాలోని వీరవల్లి పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. ఆయన మంగళవారం రిలీవ్ అయ్యారు. ఆలీకి స్టేషన్లోని సిబ్బంది వీడ్కోలు పలికారు.

ఉద్యాన రైతులకు రాయితీ బకాయిలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఉద్యాన పంటలకు సంబంధించి 2022-23, 2023-24 సంవత్సరానికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.ఈ.వై) పథకం క్రింద అవనిగడ్డ, మోపిదేవి, నాగాయలంక, కోడూరు మండలాలలోని రైతులకు సబ్సిడీ బకాయిలు విడుదల అయ్యాయన్నారు. మొత్తం 138 మంది రైతులకు గానూ 62 హెక్టారుల విస్తీర్ణంలో 7,94,756 రూపాయలు ప్రభుత్వం విడుదల చేసిందని మంగళ వారం ఉద్యాన వన శాఖ అధికారి ఎన్ రమేష్ విలేకరులకు తెలిపారు. రైతులు మీ యొక్క పంట ఫోటో మరియు బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్ కాఫీలను మీ విఎఎలకు గానీ, విహెచ్ఎ లకు గానీ వెంటనే అందచేయాలన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు రాయితీ కోసం దరఖాస్తు చేసుకోవాలని రమేష్ సూచించారు.

పట్టాదారు పాస్‌పుస్తకాలు పోయినవి

గడ్డె సాయిబాబు, తండ్రి వెంకటేశు అను నేను ఘంటశాల గ్రామ నివాసిని. నా **ఆర్.ఎస్.నెం.71-3, ఖాతా నెంబరు 791, డాక్యుమెంట్ నెం. 469/2022,** అలాగే గడ్డె సుధాలక్ష్మీ భర్త గడ్డె సాయిబాబు అను నేను ఘంటశాల గ్రామ నివాసిని. నా **ఆర్.ఎస్. నెం.73-3, ఖాతా నెంబరు 1061,** నా **డాక్యుమెంట్ నెంబరు 652/2022** గల పాస్ పుస్తకాలు జిరాక్స్ నిమిత్తం కొడాలి నుంచి ఘంటశాల వెళ్ళే మార్గమధ్యంలో పడిపోయినవి. నా పాస్‌పుస్తకాలు దొరికిన వారు నా ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయగలరు.

గడ్డె సాయిబాబు, సెల్ : 8074114097

వర్గీకరణ జడ్జిమెంట్ తీర్పుపై అప్పీల్‌కు వెళ్తాం : శ్రావణ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఎస్సీ వర్గీకరణ జడ్జిమెంట్ తీర్పుపై అప్పీల్‌కు వెళ్ళతామని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షులు,హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టడమే అవుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఈ జడ్జిమెంట్ వచ్చిన రోజు ఒక చీకటి రోజుగా ఆయన అభిప్రాయపడ్డారు. 2000 సంవత్సరంలో కలిసి ఉంటే రాజ్యాధికారం సాధిస్తారేమో అని విడదీసిన మొట్ట మొదటి వ్యక్తి చంద్రబాబు,దురదృష్టవశాత్తు ఇప్పుడు కూడా ఆయనే సిఎంగా ఉన్నారన్నారు.చైతన్యవంతమైన మాల సామాజిక వర్గాన్ని దోషులుగా చూపి మాదిగ సోదరులను విడదీశారన్నారు. ఒక ఆలోచనతో ఉన్నటువంటి ఒక వర్గాన్ని చీల్చి ,రాజకీయంగా ఎదగనీయకుండ చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. తెదేపా,జనసేన,భాజపాలో ఉన్న మాల సామాజికవర్గం ఎమ్మెల్యేలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి అపరిపక్వ జడ్జిమెంట్‌ని తాము వ్యతిరేకిస్తున్నాం అన్నారు. ఎస్సీ,ఎస్టీలకు క్రిమిలేయర్ వర్తిస్తుంది అని జడ్జిమెంట్ లో చెప్పారంటే,భవిష్యత్తులో రిజర్వేషన్లు తీసివేయడమే వారి ఉద్దేశ్యంగా కనిపిస్తుంది అన్నారు.వర్గీకరణ జడ్జిమెంట్ అమలు చేస్తే ఛలో సిఎం పిలుపును ఇస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పరసా సురేష్,ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయ పనులపై అవగాహన

విశాలాంధ్ర-గుడివాడ : కష్టించి వ్యవసాయ పనులు చేసే రైతులపై నేటి చిన్నారులకు గౌరవం పెంపొందించేలా శ్రీ సాయి సైనింగ్ స్టార్ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వ్యవసాయ పనులపై అవగాహన కల్పించడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపల్ లింగమనేని స్రవంతి అన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని శ్రీ సాయి షైనింగ్ స్టార్ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యవసాయ పనులపై అవగాహన కల్పించేందుకు దొండపాడురోడ్డు లోని వ్యవసాయ క్షేత్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని స్వయంగా నాట్లు వేసి రైతుల వద్ద నుండి పలు వ్యవసాయ సందేహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ లింగమనేని జగదీష్, పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-పెడన : బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం ద్వారా శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తల్లిపాలలో అద్భుతమైన పోషకాలు ఉంటాయని వీటి ద్వారా బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని సూపర్వైజర్ కల్పవల్లి అన్నారు. ఈ మేరకు మంగళవారం 7,8, సచివాలయాల పరిధిలో ఉన్న రామలక్ష్మి వీవర్స్ కాలనీ, కొత్తపేట లో ఉన్న నాలుగు మర్జింగ్ సెంటర్లలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఆడపిల్లలకు రక్షణ కరవు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రంలో ఆడపిల్ల పుడితే భయపడే పరిస్థితి నెలకొన్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మహిళా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ నగరంలోని పాత గవర్నమెంట్ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. 'మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, వావి వరసలు మర్చిపోయి పసిపిల్లలపై అత్యాచారం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి. మొన్న కనిగిరిలో ఐదు సంవత్సరాలు బాలికపై 14 సంవత్సరాల బాలుడు అత్యాచారం... నిన్న నూజివీడులో తల్లిదండ్రుల దగ్గర నిద్రపోతున్న ఐదు సంవత్స రాల పాపని తీసుకువెళ్లి అత్యాచారం చేయడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. బడిగుడి ఎక్కడా మహిళ లకు భద్రత లేదు. విజయవాడలోని ఓ కార్పొరేట్ స్కూల్లో ప్రిన్సిపాల్ అక్కడ చదువుతున్న అమ్మాయిపై వేధింపు లకు పాల్పడటం దుర్మార్గం. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయింది. వీటన్నిటికీ ముఖ్యం కారణం మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలు అని అందరికీ తెలిసినా నిరోధించడంలో పాలకులు విఫలమయ్యారు. వీటితోపాటు ఫోన్లలో అసభ్యకర సన్నివేశాలు చిన్నపిల్లలు చూడకూడని వాటిని కూడా ఫోన్ లో చూపించే పరిస్థితి నెలకొంది. చిన్న పిల్లలు ఫోన్లో చూసి ఇలా దారుణాలకు పాల్పడుతున్నారు. ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం తప్ప దీనిపై శాశ్వత పరిష్కారం చేసే పరిస్థితి లేదు. నిర్భయ, ఫోక్సో చట్టాలను తీసుకువచ్చారు. కానీ అవి సక్రమంగా అమలు చేసే పరిస్థితి లేదు. లైంగిక నేరాల నియంత్రణకు నిరంతర పర్యవేక్షించే ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, పాలకులు బాధ్యత తీసుకోవాలని పసిపిల్లలకు భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కోరుతున్నాం' అని పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల వసతి గృహాలోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఆందోళనకు పిలుపులో భాగంగా ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాయికుమార్ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యారని, కనీసం విద్యార్థులకు మరుగుదొడ్లుగాని స్నానపు గదులుగాని లేని పరిస్థితి జిల్లాలో నెలకొందన్నారు. తిరువూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న హాస్టల్‌ని తక్షణమే మహిళలకి కేటాయించాలని కోరారు. జిల్లాలో చాలా హాస్టల్స్‌లో పరిమితికి మించి ఎక్కువమంది విద్యార్థులు ఉంటున్నారని తక్షణమే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అనుగుణంగా హాస్టల్ గదులు పెంచాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ట్యూటర్లకు గత సంవత్సరం నుంచి జీతాలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందలేదని తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెద్దపీట వేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తక్షణమే విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ ,జగదీష్ నాయకులు సుధీర్, అయ్యప్ప, సురేష్ ,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దోషిని కఠినంగా శిక్షిస్తాం

రాష్ట్ర మంత్రి కె.పార్ధసారధి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : బాలికలపై లైంగిక దాడి అవమానం, మానుషమని, దోషిని కఠినాతి కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖామంత్రి కే.పార్ధసారధి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ మండలం పల్లెర్లమూడి గ్రామంలో హత్యాచారానికి గురై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆమె కుటుంబ సభ్యులను మంత్రి మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మానవత్వాన్ని మరిచి ఓ తాగుబోతు అత్యంత అమానుష చర్యలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇప్పటికే సంఘటనకు కారకులైన వారికి గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని, పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తక్షణం రంగంలోకి దిగిన పోలీసులు నిందితుని గుర్తించి రెంటుచింతల వద్ద అదుపులోకి తీసుకోవటం జరిగిందని, నిందితునిపై పోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి భవిష్యత్తులో ఇలాంటి సంఘటన పునరావృతంకాకుండా కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబాన్ని అదుకునేందుకు తక్షణ సహాయం అందించటం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆయన పాత ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్య పనులను పరిశీలించి రోగుల వెంట వచ్చే సహాయకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరిన్‌టెండెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిన్‌టెండెంట్ డా.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరిన్‌టెన్‌డెంట్ డా.శోభ, హిమబిందు, వైద్యులు పాల్గొన్నారు.

విజయవాడ పోలీస్ కమిషనరేట్ ప్రక్షాళన

-వారం రోజుల వ్యవధిలో మరో 35 మంది బదిలీ
-కీలక స్టేషన్లకు సీనియర్ అధికారుల నియామకం
-ఆదేశాలు జారీ చేసిన పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్) : ఎన్‌టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో మరోసారి భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. పోలీసు కమిషనర్‌గా ఎస్‌పీ రాజశేఖర్‌బాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండోసారి ఈ బదిలీలు చేపట్టారు. తొలి విడతలో ఈ నెల రెండో తేదీన 53 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయగా, తాజాగా మంగళవారం 35 మందిని బదిలీ చేస్తూ సీపీ రాజశేఖర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈసారి విజయవాడ నగరంలో కీలకమైన పోలీసు స్టేషన్లకు సీనియర్ అధికారులను నియమించారు. దీంతో పోలీస్ కమిషనరేట్‌ను సీపీ రాజశేఖర్‌బాబు పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేశారు. నగర నడిబొడ్డున ఉన్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ అధికారిగా ఎస్ఎస్‌వీ నాగరాజును, కొత్తపేట సీఐగా ఎస్ చిన్న కొండలరావును, సూర్యారావుపేటకు షేక్ అహ్మద్ అలీని నియమించారు. ఇబ్రహీంపట్నం సీఐగా ఏ చంద్రశేఖర్‌రావు, సత్యనారాయపురం సీఐగా వై బాల రాజాజీని నియమించారు.కాగా, పోలీస్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లుగా పీ చంద్రశేఖర్‌రావు నియమించారు. నందిగామ టౌన్ సీఐ హనీష్‌కుమార్‌ను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేసి, ఆ స్థానంలో వైవీవీఎల్ నాయుడును నియమించారు. నందిగామ రూరల్‌కు సీనియర్ సీఐ డీ చౌహాన్‌ను, తిరువూరుకు కె గిరిబాబును, మైలవరం సీఐగా డీ చంద్రశేఖర్‌రావును నియమించారు. ఇదిలావుండగా, విజయవాడ నగరంలోని ఒక్క గుణదల పోలీస్ స్టేషన్ మినహా అన్ని స్టేషన్లకు అధికారుల నియామకం పూర్తయింది. విజయవాడ నగరంలోని ట్రాఫిక్ విభాగాలు, సీసీఎస్, సైబర్ క్రైమ్ విభాగాలను కూడా భర్తీ చేశారు.

వన్‌టౌన్ సీఐగా గురుప్రకాష్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా గురుప్రకాష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ నుండి వన్‌టౌన్ స్టేషన్‌కు ఎన్టీఆర్ జిల్లా సీపీ రాజశేఖరబాబు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గురుప్రకాష్ మాట్లాడుతూ ప్రలోభాలకు తావులేకుండా అంకితభావం, పారదర్శకతతో పనిచేస్తానన్నారు. ముఖ్యంగా ప్రజలు సహకరిస్తే నేరాలను అదుపు చేసేందుకు మరింత దోహదపడుతుందన్నారు. గురుప్రకాష్‌ను స్టేషన్ సిబ్బంది సాదర స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి పనులు



విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని, అన్ని శాఖల అధికారుల కార్యచరణ ప్రణాళిక ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.సృజన స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిర్వహించిన జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సదస్సు అంశాలను స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం జిల్లా యంత్రాంగానికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సహజ వనరులు, సంక్షేమం, గృహ నిర్మాణం ఇలా శాఖల వారీగా సమీక్ష జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకుని అధికారులు సమన్వయంతో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షలు, తనిఖీలు నిర్వహిస్తూ చేపట్టిన పనిలో పురోగతి ఉండేలా చూడాలన్నారు. జీరో పాపర్టీ, భౌతిక మౌలిక వసుతుల అభివృద్ధి, జనాభాలో యువశక్తి, జీవన సౌలభ్య సంక్షేమం, అభివృద్ధి అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం విజన్ ఆంధ్రా 2047 దార్శనిక ప్రణాళికను రూపొందిస్తోందని, ఇందుకు జిల్లా పరంగా అవసరమైన నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. పేదల జీవన ప్రమాణాలను పెంచి వారిని పేదరికంకం నుంచి దూరం చేసేలా ప్రభుత్వం పేదలసేవలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒక్క పారిశ్రామిక రంగంలోనే కాకుండా వివిధ రంగాల్లో ఉద్యోగాల కల్పన, జీవనోపాధి సృష్టిపై దృష్టి సారించాలన్నారు. ప్రజా సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు నూరు శాతం ఫలితాలనిచ్చేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా ఇలా ఏ పని చేపట్టినా మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉండాలన్నారు. సామాజిక ఆస్తుల సృష్టిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మంచినీటి కుళాయి కనెక్షన్లు, మరుగుదొడ్లు, వీధి దీపాలు, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వాహణ తదితరాలపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఉపాది హామీ పథకం అనుసందానంతో ఉద్యాన పంటలు చేపట్టేలా, పామ్ పాండ్‌లను అభివృద్ధి చేసేలా చూడాలని సూచించారు. ఈ పంటల బుకింగ్‌పై దృష్టి పెట్టి ఈ ఏడాది సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల డీఎం వెంకటేశ్వర్లు, కేఆర్‌సీసీ స్పెషల్ డీసీ కిరణ్మయి, సీపీవో శ్రీలత, డ్వామా పీడీ సునీత, డీపీవో శివప్రసాద్‌యాదవ్, డీఇవో సుబ్బారావు, డీఎస్‌వో మోహన్‌బాబు, డీఎంహెచ్‌వో డా.సుహాసిని, హౌసింగ్ పీడీ రజనీకుమార్, పరిశ్రమల అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-నందిగామ రూరల్ న్యూస్ :- వలంటీర్లకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ లంక గోవిందరాజులుతో కలిసి మంగళవారం నందిగామ తహసిల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుండి బకాయిపడ్డ రెండు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయించాలని, రాజీనామా చేసిన వలంటీర్లను బలవంతపు రాజీనామాలుగా గుర్తించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ నందిగామలోని వలంటీర్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి లెటర్స్ రాసి పోస్టు ద్వారా పంపించారనీ అన్నారు, వలంటీర్లకి రూ.10 వేలు జీతం ఇస్తామని మరి అలాగే ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే ఎంప్లాయిమెంట్ చేయాలని, రాష్ట్రంలో ఉన్న గడిచిన రెండు మూడు నెలల నుంచి జీతభత్యాలు నిలిచిపోయాయని, తక్షణమే విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు వారి జీతాన్ని తక్షణమే ఇప్పించాలని, ఎన్నికల సమయంలో లక్ష పై చిలుకు వలంటరీలో రాజీనామాలు చేశారు. ఆ రాజీనామాలను బలవంతపు రాజీనామాలుగా పరిగణలోకి తీసుకొని తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మా సమస్యల్ని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మన్నె హనుమంతురావు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి, వలంటీర్లు సరోజని, యామిని, రమణ, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గండివాగు వరదతో రాకపోకలు నిల్

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలంలో మంగళవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి పెనుగంచిప్రోలు గండి వాగు కి వరద రావడంతో పెనుగంచిప్రోలు, లింగగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ ప్రభుత్వం వారు ఎప్పటిక యి నా ఒక బ్రిడ్జి నిర్మించిన వెడలా రెండు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేయనున్నారు.

ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య దూరం పెంచే కుట్రలు సాగనివ్వం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : గత ప్రభుత్వంలో ఉద్యోగులు,పెన్షనర్లు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారు ఆ చీకటి రోజులు ఉద్యోగులు ఇంకా మరవలేదు,నూతన కూటమి ప్రభుత్వం హయాంలో ఉద్యోగులు,పెన్షనర్లకు మంచి రోజులు వచ్చాయని ఏఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి,ప్రధాన కార్యదర్శి సిహెచ్ పురుషోత్తమ నాయుడు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య దూరం పెంచేందుకు గత ప్రభుత్వంలో ఉద్యోగుల సంక్షేమ సలహాదారుగా పదవి బాధ్యతలు నిర్వహించిన నలమారు చంద్రశేఖర రెడ్డి చేస్తున్న కుట్రలు ఎన్జిజిఓ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు కలిసికట్టుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయంలో ఐదు సం.లు ఉద్యోగులకు చీకటి రోజులని, ఉద్యోగులకున్న సర్వహక్కులను ప్రయోజనాలను హరించి వేసిందని అగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్ని ఆర్ధిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒకటో తారీఖున జీతాలు, పెన్షన్లు చెల్లించటం, జిపిఎస్ గెజిట్ పై ప్రకటన, ఉద్యోగులపై ఉన్న నాలుగు వేల కేసులు ఎత్తివేస్తానని ప్రకటించడం,అధికారులతో ఉద్యోగులతో గౌరవంగా మెలగాలని మంత్రులకు కలెక్టర్లను ముఖ్యమంత్రి స్వయంగా ఆదేశించటం వంటి చర్యలు ఈ ప్రభుత్వంపై ఉద్యోగులలో నమ్మకాన్ని పెంచాయన్నారు. ఐఆర్ ప్రకటించటం, వేతన సవరణ కమిటీని నియమించడం, 62 సంవత్సరాల పదవీవిరమణ అందరికీ వర్తింపచేయడం వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు.ఈసమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఎ.రంగారావు, రాష్ట్ర కార్యదర్శులు ఎ.రంజిత్ నాయుడు,ఎ.వి.కృష్ణారెడ్డి, పి.శివ ప్రసాద్, ఏపిఎన్జిజీవోస్ కాపిటల్ సిటీ అధ్యక్షులు సి.హెచ్. నాగభూషణం, పశ్చిమ కృష్ణా జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం. రాజుబాబు, సిటీ అధ్యక్షులు సివిఆర్ ప్రసాద్, సహాధ్యక్షుడు రాజశేఖర్ కార్యదర్శి నజీరుద్దీన్, శ్రీకాకుళం అధ్యక్షులు హెచ్. సాయిరామ్, గుంటూరు అధ్యక్షులు జి.శ్రీనివాసరావు,కార్యదర్శి యస్. సతీష్, ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్. ఉమెన్ సబ్ కమిటీ కన్వీనర్ ఎం.రాజ్యలక్ష్మి, ఎన్జీవో సమాచారం సబ్ ఎడిటర్ ఎన్. భారతి, ప్రసాద్, ఎపిపిఇఒఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వి. వేణు మాధవ్, ఎ.రామస్వామి,వి. సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బత్తుల నాగేశ్వరరావు మృతికి సంతాపం

విశాలాంధ్ర-తిరువూరు : బత్తుల వెంకటేశ్వర రావు మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె నాగుల్‌మీరా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి చిలుకూరు వెంకటేశ్వరరావు, విసన్నపేట మండల కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు, పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, ఏ కొండూరు మండల కార్యదర్శి మేకల దేవిడ్ సంతాపం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా నాయకులు, సీపీఐ నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు అకాల మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని తూము కృష్ణయ్య వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బత్తుల వెంకటేశ్వరరావు ఉమ్మడి కృష్ణాజిల్లా నాయ కుడిగా అగ్రనాయకులతో కలిసి భూ పోరాటాలు చురుగ్గా పాల్గొనేవారని, నిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే వారని, పార్టీలో నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన నాయ కుడని అన్నారు. అలాంటి మంచి మనిషి అకస్మాత్ మృతి దిగ్భ్రాంతి కి గురి చేసిందని తెలిపారు. తిరువూరు నియోజకవర్గం నుండి నూజివీడు, దిగవల్లి గ్రామంలోని వారి ఇంటి వద్ద జరుగు తున్న అంత్యక్రియల చేరుకొని బత్తుల వెంకటే శ్వరరావు మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఎస్.కే నాగుల మీరా, చిలుకూరు వెంకటేశ్వరరావు, మర్సకట్ల త్యాగరాజు, మేకల దేవిడ్‌లు జోహార్లు అర్పించారు.

జీఓ 117 రద్దు తర్వాతే పని సర్దుబాటు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ విద్యాశాఖ రాష్ట్రంలోని అన్ని పాఠశాల లలో పని సర్దుబాటుకు సిద్ధపడుతున్నందున, పని సర్దుబాటు చేయటానికి ముందే ఉపాధ్యాయ సంఘ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, గత ప్రభుత్వ విధానాల వలన గాడి తప్పిన విద్యా వ్యవస్థను సరి చేయటానికి తీసుకొన వలసిన విధివిధానాలపై చర్చించిన తరువాత, ముఖ్యంగా జీవో నెంబర్ 117ను రద్దు చేసిన తర్వాతే పని సర్దుబాటు చేయాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు వేముల భిక్షమయ్య మంగళవారం ఒక ప్రకటన లో కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యులు తీసుకున్న వెంటనే వారు పాదయాత్రలో ఇచ్చినటువంటి హామీ అయిన జీవో 117 రద్దు చేస్తారని ఉపాధ్యాయ లోకమంతా ఆశించిందని పేర్కొన్నారు. దానికి విరుద్ధంగా జీవో 117 రద్దు చేయకుండానే ప్రభుత్వం పని సర్దుబాటుకు సిద్ధమవటం చాలా విచారకరం అన్నారు. మూడు, నాలుగు ,ఐదు తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయటం వలన ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా మూత దశకు చేరుకున్నాయన్నారు. జీవో నెంబర్ 117 రద్దు చేయకపోతే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కూడా మూత దశకు చేరుకోవడం జరుగుతుందన్నారు. నూతన ప్రభుత్వం జీవో నెంబర్ 117 రద్దు పై తక్షణమే నిర్ణయం తీసుకొని , ఆ తరువాతనే పని సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టాయిలెట్ ఫోటోలు తీయటం నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చి, ఉపాధ్యాయుల గౌరవం కాపాడినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేసినారు. గత ప్రభుత్వంలో చెల్లించకుండా ఉన్న డీఏ బకాయిల చెల్లింపుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE XII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
E.P.No. 2800 / 2019
IN
A.O.P. No. 506 / 2014

Between :
M/s. Shriram Transport Finance Co. Ltd., Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1. Padamata Mutyala Rao
2. Gunikandhula Venkateswara Rao ...JDR/Respondents

NOTICE TO JDR-2 / RESPONDENT

Gunikandhula Venkateswara Rao, S/o. Nagesu, R/o. D.No. 11-75/1, Enikepadu, Vijayawada - 521108.

Take notice that the above Execution Petition filed by the DHR / Claimant praying orders against JDR-2. The same is posted to 07-08-2024 for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(By order of the Hon'ble Court)
Sri Sk. Abdul Azeem, Advocate
D.No. 54-4-22, Plot No. 34, Block No. E-25, 3rd Cross Road, Disposal Road, Jawahar Auto Nagar, Vijayawada -520007.
Cell. No: 9392100578.

BEFORE THE ARBITRATOR FOR CENTRAL CHENNAI CHIT FUND CASES COURT. INTEGRATED OFFICE COMPLEX FOR COMMERCIAL TAX AND REGISTRATION DEPARTMENT, GROUND FLOOR, VETERINARY HOSPITAL CAMPUS, ANNA SALAI, NANDANAM, CHENNAI - 600 035.

ARC.No. 371/2023

Sree Gokulam Chit & Finance Company (P) Ltd., No.49, Arcot Road, Kodambakkam, Chennai - 24. ....Disputant

VERSUS

SWETHAS SLEEP STORE & Another ..Opponents
1) Swetha's Sleep Store, Rep by its Managing Partner, Dudiki Rani, D.No.150/3, Amaravathi Road, YSR Circle, Nagaralu, Guntur-522 034.
2) Dudiki Madhava Rao, S/o. Dudiki Samba Siva Rao, D.No.32-4-1/4, Ramasamy Street, Opp.Navodaya School Road, Prajasakthi Nagar, Venkateswara Puram, Vijayawada, Krishna District, Andhra Pradesh-520010. ....Opponents

Take Notice that the above Arbitration case filed by Disputant Company for the recovery of Rs. 14,43,980/- together with further interest and case is posted on 22/08/2024. Therefore you are requested to appear before the learned Arbitrator for Chit Fund Cases, Central Chennai, Chennai-35 on 22/08/2024 at 11 A.M in person, failing which the above case will be heard and decided Exparte.

P. KARTHIKA, B.A., LL.B.,
Advocate for Disputant, Chennai.

నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమైనదని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర అన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని మీటింగ్ హాల్‌లో కమిషనర్ మంగళవారం కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోడ్‌లో విజయవాడ అభివృద్ధి పనుల్లో వారి సహకారం, భాగస్వామ్యం, బాధ్యత, కనబడుతుందన్నారు. ఏపని చేపట్టినా నాణ్యతా ప్రమాణాలతో చేయాలని, వారికి ఎలాంటి సమస్య ఉన్నా కమిషనర్‌కి ప్రత్యక్షంగా తెలుపవచ్చన్నారు. కాంట్రాక్టర్లు అంతా ఒకరికొకరు సమన్వయంగా ఉండి నగరాభివృద్ధికి వారి వినూత్న ఆలోచనలు, సూచనలకు ఎల్లప్పుడూ సహకరిస్తారని తెలిపారు. తొలత ఈ సమావేశంలో ఇటీవలే నూతనంగా నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు కాంట్రాక్టర్లు అభినందనలు తెలిపారు. అనంతరం నగరంలో వారు నిర్వహించిన పలు పనులకు సంబంధించిన వాళ్లకు రావాల్సిన చెల్లింపులు, డిపాజిట్లు, పనుల్లో వాళ్లకు ఎదురయ్యే ఇబ్బందులను కమిషనర్ వివరనించారు. వారి ప్రతి సమస్యకి ఖచ్చితమైన పరిష్కారం చూపుతామని కమిషనర్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ డా.మహేష్, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు, సుపరిండెంటింగ్ ఇంజనీరలు నరసింహమూర్తి, రామ్మోహన్‌రావు, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రైల్వే ఉగ్యోగికి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరిలోని పాలకొల్లులో జరిగిన 16వ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్ 2024-25 మాస్టర్స్ కేజీ వెయిట్ కేటగిరీలో విజయవాడ డివిజన్‌లోని పర్సనల్ బ్రాంచ్ జనరల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న జె. వరప్రసాద్ విజయాన్ని సాధించారు.85 కిలోల బరువు,50 ప్లస్ వయస్సు విభాగంలో ఆకట్టుకునేలా తన అసాధారణమైన శరీరాకృతి బాడీబిల్డింగ్ నైపుణ్యాలను ప్రదర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ బాడీబిల్డర్లు పాల్గొన్న ఈ పోటీలో ఆయనకు మిస్టర్ ఆంధ్ర బిరుదు పొందారు.ఈయన 2023-24లో ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఆసియన్ బౌడీ బిల్డింగ్ ఛాంపియన్ మీట్‌లో నాల్గవ స్థానంలో నిలిచారు.2023-24లో బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని కూడా సాధించారు.కఠోరమైన శిక్షణతో బాడీబిల్డింగ్‌పై నిబద్ధత ఫలితంగా ఆయన ఈ ఘనత సాధించారు.ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్ అద్భుతమైన విజయాన్ని సాధించిన వరప్రసాద్ అభినందించారు. రైల్వే కుటుంబానికి గర్వకారణంగా నిలిచారన్నారు. ఇది ఆయన అంకితభావం, కృషితో ఆటు బాడీబిల్డింగ్‌పై ఉన్న మక్కువను ప్రతిబింబిస్తుందన్నారు.అతని విజయం ఒక ప్రేరణ. రైల్వే ఉద్యోగులందరికీ మా సిబ్బంది ప్రతిభకు,బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనం అన్నారు.భవిష్యత్తులో బాడీబిల్డింగ్ ప్రయత్నాలలో మరిన్ని విజయాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, విజయవాడ
ఎ.యస్. నెం.199/2019

బిట్వీన్:
కండెల కృష్ణ చైతన్య, తండ్రి: సాంబశివరావు, హిందు, వయస్సు: 28 సం॥, నివాసము: యస్.టి. కాలనీ, కొండపల్లి గ్రామము-521 228, ఇబ్రహీంపట్నం మండలం, యస్.టి.ఆర్/కృష్ణాజిల్లా. - అప్పిలెంట్.
మరియు
దాచేపల్లి వెంకట మురళీకృష్ణ, తండ్రి: రామారావు, హిందు, వయస్సు: 56 సం॥, నివాసము:డోర్ నెం. 9-68-9, దూది ఫ్యాక్టరీ స్ట్రీట్, కొత్తపేట, విజయవాడ- 1, కృష్ణా/యన్.టి.ఆర్ జిల్లా. - రెస్పాండెంట్

పై నెంబరు అప్పీలులోని రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారి నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ ఉద్దేశ్య పూర్వకముగా అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారి అనుమతితో ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా, ది:29-08-2024వ తేదిన ఉదయము గం॥ 10-30 ని॥లకు పై తెలిపిన కోర్టులో మీరుగానీ, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై పై తెలిపిన అప్పీలులో అక్షేపణలున్న యెడల తెలుపు కోవలయును. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ప్రచురించడమైనది.)
వాయిదా తేదీ: 29-08-2024

ఎ.వి. రమణారావు,
అప్పిలెంట్ తరపు న్యాయవాది, విజయవాడ.

ప్రకటన

నా క్లయింటు విజయవాడ కృష్ణలంక, హరనాథపురం, డోర్ నెం.41-1-123 కాపురస్తురాలు మాలపాటి రామకృష్ణారెడ్డి గారి భార్య శ్రీమతి మాలపాటి లావణ్య గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... ది.31-07-2024న ఉదయం గం. 11.00ల సమయంలో నా క్లయింటి ఈ క్రింది తెలిపిన తన పేరున గల ఓరిజనల్ దస్తావేజులను తీసుకుని సూర్యారావుపేట, నరసింహనాయుడు వీధిలోని వారి బంధువులకు చూపించి అక్కడ నుండి వాటిని తీసుకుని సూర్యారావుపేట సివిల్ కోర్టుల ప్రాంగణంలో గల ఫోటోస్టాట్ సెంటర్ వద్దకు వచ్చి చూసుకొనగా సదరు దస్తావేజులు గల కవరు కనిపించియుండలేదు. ఎంత వెదికిననూ దొరికియుండలేదు అని తెలియజేయుచున్నారు. కావున నా క్లయింటు పేరున గల ఓరిజనల్ దస్తావేజు నెం.3549/2014రు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాలో గానీ, పై తెల్పిన నా క్లయింటు అడ్రస్‌లో గానీ అందజేసి తగిన పారితోషికం పొందగలరు. అట్లు గాక సదరు దస్తావేజులను ఉపయోగించి ఎవరైననూ ఏ విధమైన లావాదేవీలు జరిపిన యెడల అవి చెల్లనేరవని అట్టి వారిపై మా క్లయింటు తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

పి. సుధాకర్‌రావు, అడ్వకేట్ & నోటరీ
డోర్ నెం.4-25-9/2, భీమనవారిపేట, కొత్తపేట, విజయవాడ-520001.
సెల్: 98481 49660

ప్రకటన

నా క్లయింటు, ఏలూరు జిల్లా, కుకునూరు గ్రామము & మండలం, రామసింగారం స్ట్రీట్, డోరు నెం.8-121/1 కాపురస్తులు ధారావత్ ధర్మారావు గారి కుమారుడు ధారావత్ నాగేంద్ర బాబు నాయక్ గారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా... నా క్లయింటు ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ తరపున మెస్సర్స్ : శ్రీ బాలాజీ ధర్మ ఫిల్లింగ్ స్టేషన్ అను పేరుతో గల పెట్రోల్ బంకు ప్రొప్రయిటర్ అయివున్నారు. వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నున్న బ్రాంచి నందు అకౌంట్ నెం. 39621997556 తో కరెంట్ అకౌంట్ మరియు చెక్ నెం. 541912 నుండి 541921 వరకు నా క్లయింట్‌చే సంతకములు చేయబడిన చెక్ బుక్ కలదు. ది.25-07-2024వ తేదీన ఉదయం 10గంటల సమయములో నా క్లయింట్ పెట్రోల్ బంక్ నుండి యస్.బి.ఐ, నున్న బ్రాంచికు మోటార్ సైకిల్ పై వెళ్ళి చూచుకొనగా పెట్రోల్ ట్యాంక్ పై కల బ్యాగ్‌లో పెట్టిన సదరు చెక్ బుక్ కనపడలేదు. వెంటనే నా క్లయింటు ఎంత వెతికినను కనబడలేదు. వెంటనే నా క్లయింట్ యస్.బి.ఐ. నున్న బ్రాంచికు వెళ్ళి బ్యాంక్ అధికారులకు కంప్లైట్ యిచ్చి సదరు చెక్‌ను బ్లాక్ చేయించినారు. సదరు చెక్‌లు నేటి వరకు ఎవరున్నా మాకు తెచ్చియివ్వలేదు. సదరు చెక్ లను ఎవరైనను ఏవిధమైన దుర్వినియోగము చేసిన యెడల నా క్లయింటు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందమూలముగా తెలియచేయుచున్నాను.

తిక్కిశెట్టి శ్రీహరిరావు, బి.యస్.సి.,బి.యల్.
అడ్వకేట్ & నోటరీ
గాంధీనగర్, విజయవాడ. సెల్: 9393430482

మధుమేహం అశ్రద్ధచేస్తే ప్రాణాంతకం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: మధుమేహ వ్యాధిగ్రస్తులలో అధిక శాతం రక్తనాళాల సమస్య ఏర్పడుతుందని దానిని అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకంగా మారుతుందని డాక్టర్ గుత్తికొండ శ్రీహర్ష తెలిపారు. జాతీయ వ్యాస్కులర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లోని కస్తూరి బాయి పేటలోని హర్ష వ్యాస్కులర్ సెంటర్ లో ఉచిత వైద్య శిబిరంతోపాటు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆసుపత్రి వైద్యులు శ్రీ హర్ష గుత్తికొండ వివరించారు... . మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో ఎక్కువగా రక్తనాళాల సమస్య ఏర్పడుతోందని దానిపై ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో అవగాహన అవసరం అన్నారు . ఎక్కువగా షుగర్ ఉన్న వ్యక్తులలో ఇన్ఫెక్షన్ కారణం గా పూర్తి గా ఆ భాగం మొత్తం కోల్పోయే అవకాశం ఉందనీ అన్నారు. 100 శాతం షుగర్ పేషంట్స్ లో 7.5 శాతం తమ కాళ్ళు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయని అన్నారు . షుగర్ వల్లనే ఎందుకు ఇలా జరుగుతుంది ప్రతి ఒక్కరిలోనూ అవగాహన ఉండాలని .... షుగర్ ఎక్కువ అయితే రక్త నాళాలు పూర్తిగా పాడయ్యే అవకాశాలు ఉంటాయని చెప్పారు . రక్త ప్రసరణ పై వైద్యుల వద్ద తగిన సూచనలు తీసుకోవాలని సూచించారు . సరైన సమయం లో వైద్యం అందించక పోతే పూర్తి గా ఆ భాగం తో పాటు ఇతర భాగాల పై కూడా ప్రభావం చూపే అవకాశం కూడా ఉంటుందన్నారు . చిన్న గాయం ఏర్పడిన అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలని చెప్పారు. ఆదునిక శాస్త్ర చికిత్స , ప్రత్యేక వైద్య విధానం ద్వారా ఈ సమస్య ను తుది దశ లోనే పరిస్కరించవచ్చని అన్నారు. కాళ్ళు పోయినా వారు ఆర్థికం గా కూడా నష్టపోవడమే కాక ... జీవిత కాలం కూడా తగ్గిపోతుందని చెప్పారు . ఈ కార్యక్రమంలో రేడియాలజిస్ట్ ప్రఫుల్ కుమార్ పాల్గొన్నారు.

సిప్లా ఆధ్వర్యంలో బ్రీత్‌ఫ్రీ మాన్‌సూన్ యాత్ర

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శ్వాసకోశ ఆరోగ్యానికి వర్షాకాలం ముఖ్యమైన సవాళ్లను కలిగిస్తుంది. పెరిగిన ఆర్ద్రత, తేమ ఊపిరితిత్తుల పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తాయి. ఈ సమయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చాలా కీలకం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రోయాక్టివ్ పేషెంట్ కేర్‌కు నిరంతర నిబద్ధతకు అనుగుణంగా, సిప్లా యొక్క సమగ్ర పేషెంట్ సపోర్ట్ ఇనిషియేటివ్ బ్రీత్‌ఫ్రీ మాన్‌సూన్ యాత్రను ప్రారంభించింది. వ్యక్తులు వారి శ్వాసకోశ ఆరోగ్య స్థితిని అర్థం చేసుకోవడంలో సహాయపడే లక్ష్యంతో, ఆస్తమా, సిఓపిడి (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) వంటి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్‌లకు యాత్ర అధిక ప్రాప్తిని అందిస్తుంది. మూడు నెలల వ్యవధిలో, దేశవ్యాప్తంగా 4,000 కంటే ఎక్కువ శిబిరాలు నిర్వహించబడతాయని, 3.50 లక్షల మంది పరీక్షించబడతారు. బ్రీత్‌ఫ్రీ మాన్‌సూన్ యాత్ర దేశవ్యాప్తంగా వ్యక్తులు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి అవసరమైన సమాచారం, వనరులకు ప్రాప్యతను కలిగి ఉండేలా నిర్థారిస్తుందని కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్, స్లీప్‌మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ కార్తీక్ తిరుపతి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అమెజాన్‌తో ఆప్కో హ్యాండ్లూమ్స్ ప్రయాణం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): జాతీయ చేనేత దినోత్సవాన్ని అమెజాన్ జరుపుకుంటున్నందున, స్థానిక కళాకారుల అభ్యున్నతికి అంకితమైన ఆప్కో హ్యాండ్లూమ్స్ వంటి వ్యాపారాల పై దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్‌లో, చేనేతపై ప్రేమ, సమాజపు సాంస్కృతిక చరిత్రలో లోతుగా పాతుకుపోయింది. ఆప్కో హ్యాండ్లూమ్స్ గ్రూప్ చెందిన ఎ పి స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ (ఏపీఎస్ హెచ్ డబ్ల్యు సి ఎస్) స్వప్నమైన అంకితభావంతో ఈ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. 1976లో స్థాపించబడిన ఆప్కో హ్యాండ్లూమ్స్ అనేక మంది కళాకారులు, చేనేత కార్మికుల జీవనోపాధికి మద్దతునిస్తూ, ఆంధ్ర ప్రదేశ్ యొక్క క్లిష్టమైన చేనేత సంప్రదాయాన్ని పునరుద్ధరించాలనే లక్ష్యం పెట్టుకుంది.అమెజాన్‌తో భాగస్వామ్యం 2019లో, ఆప్కో హ్యాండ్లూమ్స్ అమెజాన్‌తో పరివర్తనాత్మక ప్రయాణాన్ని ప్రారంభించింది.

శరవేగంగా ధర్మచక్రం చిత్రం షూటింగ్

విశాలాంధ్ర-విజయవాడ(సిటీనగర్): ప్రజలు నమ్మి ఒక్క ఛాన్స్ ఇచ్చిన తప్పుకి జరిగిన పర్యవసానమే ధర్మచక్రం చిత్రమని దర్శకుడు పసుపులేటి వెంకటరమణ అన్నారు. మంగళవారం విజయవాడ లోని వై ఎస్ ఆర్ కాలనీలో చిత్ర షూటింగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక సామాన్యుడు అసమర్థుడైనా ఎలా మారాడు. రాముడు ఏమి తప్పు చేసాడని అరణ్యవాసం చేసాడు, హరిశ్చంద్రుడు ఏమిచేసాడని కాటికి కాపలాదారుడిగా మారడని ఇతిహాసాలను గుర్తు చేశారు. నారా చంద్రబాబు ఏమి తప్పు చేసాడని 53 రోజులు జైలు పాలయ్యాడనే ఈ చిత్ర సారాంశమని అన్నారు. గత 20 రోజులుగా రాజధాని అమరావతి, విజయవాడ ప్రాంత లలో షూటింగ్ జరుపుకుంటుందని తెలిపారు. కొడెరిల ఆర్ట్స్ సమర్పణలో మనోహర నాయుడు నిర్మాణంలో వి.ఆర్.పి. క్రియేషన్స్ పతాకం పై నిర్మిస్తున్న చిత్రంలో ధనుంజయ్ మహారాష్ట్ర, కళ్యాణ్ హైదరాబాద్, అరుణ్ విజయ్, వలపర్ల సురేష్, జర్నలిస్ట్, దేవిక, కావ్య, భాను, లక్ష్మీ నారాగని అజయ్, జాఫర్ తదితర తారాగణం నటించగా ఎడిటర్ నందమూరి హరి, సంగీతం శంకరమహదేవ్, డిజైన్ వెంకట్, పోస్ట్ ప్రొడక్షన్ ఫ్రేమ్ లు నిర్వహిస్తున్నారని తెలిపారు.

జేఎస్ డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా మరో ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : జేఎస్ డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా బ్రైవ్ ఈవోలో మార్గదర్శకత ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) ఆవిష్కరణ సిరీస్ ను విడుదల చేసిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ ఆటోమోటివ్ ఈవీ వ్యవస్థల డొమైన్స్ నుండి ప్రముఖ పరిశ్రమ భాగస్వాముల భాగస్వామ్యంతో స్మార్ట్‌లో, భారత్ మండపంలో కంపెనీ ఈ కార్యక్రమం నిర్వహించిందన్నారు. హబ్ కార్యక్రమంలో, పరిశ్రమలో మొదటి మరియు అతి పెద్ద ఛార్జింగ్ ప్లాట్ ఫాం ఓఈఎం ప్రారంభించబడిందన్నారు. ప్రాజెక్ట్ రివైవ్, ఈవీపీడియా ఈవీ బ్యాటరీల పును లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. ఎంజి-జియో ఇన్నోవేటివ్ కనెక్టివిటీ ప్లాట్ ఫాం (ఎంజి-జియో ఐసీపీ) రాభోయే ఎంజీ వాహనాలలో స్టాండర్డ్ గా నిలుస్తుందన్నారు.జేఎస్ డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా పరిశ్రమలో మొదటి ప్రత్యేకమైన ఈవీ అవగాహన ప్లాట్ ఫాం ఈ వీ పీ డి ఐ ఎ ను విడుదల చేసిందన్నారు.జేఎస్ డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియాలో గౌరవ్ గుప్తా, చీఫ్ గ్రోత్ ఆఫీసర్, భారతదేశంలో ఎలక్ట్రిక్ సంచారం యొక్క భవిష్యత్తును పునః నిర్వచించడంలో కంపెనీ వారి కలను తెలియచేస్తూ ఇలా అన్నారు.జేఎస్ డబ్ల్యు ఎంజి మోటార్ విజయవంతంగా దేశపు మొదటి ఇంటర్నెట్ ఎలక్ట్రిక్ ఎస్ యువి, ఎంజి జడ్ఎస్ ఈవీని మరియు కొత్త పట్టణ సంచార పరిష్కారం, ఎంజి కామెట్ ఈవీని విడుదల చేసిందన్నారు.

గుడివాడ లయన్స్ క్లబ్ 11 అవార్డులు

విశాలాంధ్ర-గుడివాడ : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2023-24 సంవత్సరంలో ఉత్తమ సేవలు అందించిన గుడివాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు విస్సంరెడ్డి కృష్ణకిషోర్కు, సెక్రటరీ ఉప్పలపాటి సతీష్, ట్రెజరర్ గుడివాడ వెణుగోపాలస్వామి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ యలవర్తి వెంకటకృష్ణారావులకు ప్రథమ బహుమతులు రావడం అభినందనీయమని లయన్స్ సభ్యులు నిమ్మగడ్డ శివశంకర్, నవల పి.సతీష్, టి.తిరుపతిరెడ్డి, పి.సుబ్రహ్మణ్యం(పండు) అన్నారు. మంగళవారం స్థానిక జగన్మోహనపురంలోని డ్రీమ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గత గుండు క్షేత్రం విజయవాడలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాజీ గవర్నర్ లయన్స్ క్లబ్ జి.యస్.శంకరయ్య, పియంజె, ప్రస్తుత గవర్నర్ గద్దె శేషగిరిరావు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉత్తమ సేవలు అందించినందుకు ఉత్తమమైన సేవలకు 11వ అవార్డులు రావడం జరిగిందన్నారు. గత సెంబులో పేదలకు ఉచిత భోజనం అందించడం, కంటి ఆపరేషన్లు, పాఠశాలలో విద్యార్థులకు మెడికల్ క్యాంపుల నిర్వహణ, ప్రజలకు అవసరమైన సేవలకు ప్రథమ అవార్డులు రావడం గొప్ప విషయమన్నారు. ప్రతీసంవత్సరం గుడివాడ లయన్స్ క్లబ్‌లో సభ్యుల సహకారంతో ఈ విధంగా గుడివాడకు ఇన్ని బహుమతులు రావడం గుడివాడకే గర్వకారణమన్నారు.

పంట కాలువల్లో పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మండలి

విశాలాంధ్ర - చల్లపల్లి: చల్లపల్లి మండల పరిధిలోని వెలు పంట కాలువల్లో పూడికతీత, కూటూరు తొలగింపు పనులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం పరిశీలించారు. చల్లపల్లి మండలం రామానగరం వద్ద 6/1 పంటకాలువ పనులు, కె.కొత్తపాలెం.. పోగోలు ప్రాంతంలో 8వ నెంబరు పంట కాలువ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ ఛైర్మన్ వెంకట్రామ్, ఇరిగేషన్ డీఈఈలు రాజేశ్ రవికిరణ్, డైరెక్టర్ డీఈఈ పి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మేకా బంగారుబాబు, మాజీ నీటిసంఘం అధ్యక్షుడు తొట్టెంపూడి పెదబాబు, టీడీపీ నేత గొరిపర్తి సుబ్బారావు, రైతు నేతలు వేమూరి రమేష్ బాబు, మేమూరి గోవర్ధన్, రైతులు, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఆర్.జి.ఈ.సి. అధ్యాపకులకు పీహెచ్‌డీ పట్టాలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరులోని స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు రాష్ట్ర మరియు రాష్ట్రేతర విశ్వవిద్యాలయాల నుండి వివిధ సాంకేతిక నృపాల కలిగిన అంశాలపై పరిశోధనలు చేసి సత్ఫలితాలు పొందినందుకు పి.హెచ్.డి. పట్టాలు పొందారు. గడిమెళ్ళ భారతి (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం) (జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ నుండి) ఎస్.ఆర్.జి.ఈ.సి. ప్రొఫెసర్ డా.బి.వి.ఎస్.ఎన్.ఆర్.వి.ప్రసాద్ గైడ్ గా, జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.హెచ్.కృష్ణ ప్రసాద్ కో గైడ్ గా,గుండిగ రాజా కుమార్(ఆంగ్ల విభాగం) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మరియు ప్రొఫెసర్ డా.బి.కరుణ సూపర్వైజర్ గా,వి.ఫణి కుమార్ (సివిల్ ఇంజనీరింగ్ విభాగం)శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి నుండి సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.సి.హెచ్ సుధారాణి గైడ్ గా,షేక్ అబ్దుల్ మతిన్(ఆస్యుల ఆద్యం)కృష్ణా విశ్వవిద్యాలయం నుండి పి.బి.సిద్ధార్థ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.దేవిరి రాజు గైడ్ గా మరియు కృష్ణా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.డి.రామశేఖర్ రెడ్డి కో గైడ్ గా,వి. శ్రీనివాసు కుమార్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం)జవహర్లాల్ విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. ఎన్.జి.శాంతి సూపర్వైజర్ గా మరియు ఎస్.ఆర్.జి.ఈ.సి. నుండి ఎ.సి. ఐ %ఈ% డి.ఎస్. విభాగాధిపతి డా.ఎస్.నారాయణ కో గైడ్ గా ,పి. అశోక్ రెడ్డి (ఏ.ఐ.డి.ఎస్. విభాగం)అన్నామలై యూనివర్సిటీ నుండి డా. ఆర్ సత్య సూపర్ వైజర్ మరియు ఎస్.ఆర్.జి.ఈ.సి. ఏ. ఐ %ఈ% డి.ఎస్. విభాగాధిపతి డా.ఎస్.నారాయణ కో సూపర్ వైజర్ గా,తెనాలి నాగమణి (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,గుంటూరు నుండి ఆర్.వి.ఆర్.అండ్ జె.సి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ప్రొఫెసర్ అండ్, ఏ.ఐ.ఎం.ఎల్. విభాగాధిపతి డా.బి.రామ మోహన్ బాబు సూపర్వైజర్ గా, పి.శేఖర్మూర్తి (మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం) జవహర్ లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయం నుండి లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా.కె.దిలీప్ కుమార్ సూపర్వైజర్ గా మరియు జె.ఎన్.టి.యు. ప్రొఫెసర్ డా.బి. బాలకృష్ణ కో సూపర్వైజర్ గా, ఎస్.భవాని (ఈ.సి.ఈ. విభాగం) పాండిచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.టి.షణ్ముగానందం సూపర్వైజర్ గా, కె.పృథ్వీరాజ్(ఎం.బి.ఏ. విభాగం) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.టి.ప్రసన్న కుమార్ సూపర్వైజర్ గా,టి.హేమంత్ కుమార్(ఎం.బి.ఏ. విభాగం) ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.ఏ.నరసింహ రావు రీసెర్చ్ గైడ్ గా, (శ్రీమతి బి.నాగ శిరీష (ఈ.సి.ఈ. విభాగం) జె.ఎన్.టి.యు.కె. నుండి శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డా.వి.వి.కె.డి.వి. ప్రసాద్ సూపర్వైజర్ గా,పి.అంజయ్య బాబు (సివిల్ ఇంజనీరింగ్ విభాగం) గీతం యూనివర్సిటీ, విశాఖపట్నం నుండి సివిల్ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ డా.కె.వి.రమేష్ గైడు గా,బి.వంశీ కృష్ణ (ఈ.సి.ఈ. విభాగం) కె.ఎల్ యూనివర్సిటీ గుంటూర్ నుండి ఆ విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా.షేక్ నూర్ బాషా గైడ్ గా మరియు ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ (ఏ.పి) అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎం.దుర్గా ప్రకాష్ కో గైడ్ గా,బి.అవధ్ (సి.ఎస్.ఈ. విభాగం) అన్నామలై యూనివర్సిటీ, చిదంబరం నుండి సి.ఎస్.ఈ విభాగం ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి డా.ఆర్. భవాని మరియు ఎస్.ఆర్.జి.ఈ.సి. ఇన్ఛార్జ్ మేనేజ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డా.సి.హెచ్.కవిత కో గైడ్ గా పరిశోధనలు చేసి పి.హెచ్.డి. పట్టాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. గత ఆరు నెలల వ్యవధిలో కళాశాల అధ్యాపకులు పదిహేను మంది వివిధ విభాగాల్లో పి.హెచ్.డి. పట్టాలు పొందటం గమనార్హం.వీరు తమ పరిశోధనా కాలంలో వివిధ జాతీయ మరియు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని అనేక పరిశోధనా పత్రాలను సమర్పించి ప్రచురణ గావించారు.ఉద్యోగంలో తమ విధులు నిర్వహిస్తూనే, శ్రమించి పట్టభద్రులతో డాక్టరేట్ డిగ్రీలు పొందిన అధ్యాపకులను కళాశాల యాజమాన్య సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్ర బాబు, డైరెక్టర్స్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి.ప్రసాద్, డాక్టర్ ఎం.కామరాజు, డాక్టర్ పార్థసారథి రామానుజం, బి.ఎస్. అండ్ హెచ్. విభాగాధిపతి డాక్టర్ ఎస్.సురేష్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. వి.హెచ్.ఎల్.సుభాష్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.సి.హెచ్. కిషోర్ కుమార్, ఈ.సి.ఈ. విభాగాధిపతి డాక్టర్ బి.రాజ శేఖర్,సి.ఎస్.ఈ విభాగాధిపతి డా.ఎం.బాబు రావు, ఐ.టి. విభాగాధిపతి డాక్టర్ డి.ఎన్.వి.ఎస్.ఎల్.ఎస్. ఇందిర, ఏ.ఐ %ఈ% డి.ఎస్.విభాగాధిపతి డా.ఎస్.నారాయణ, ఎం.బి.ఏ. విభాగాధిపతి డాక్టర్ జి.కమల్, వివిధ విభాగాధిపతులు, మెంటర్స్, ఆధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు అభినందనలు మరియు శు భాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-కూచిపూడి : బిడ్డపుట్టిన అరగంట లోపుగా ముర్రుపాలుతాగిస్తే సంపూర్ణ ఆరోగ్యం తలుగా ఉంటారని నిడుమోలు సెక్టార్ సూపర్వైజర్ అబ్దుల్ సలీమున్నీసాపేర్కొన్నారు. మొవ్వ మండలం లోని పెదసనగల్లు సీతమాగిరిలోఅంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిపాలతో వ్యాధినిరోధక శక్తి తోపాటు పెరుగుదల కూడా అధికంగా ఉంటుందని వైద్య నిపుణులు సైతంతల్లిపాలకే ప్రాధాన్యత నిస్తున్నారనిమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె తో పాటు అంగన్వాడీ కార్యకర్త కేవీఎల్ మనోహరం పాల్గొంది. అలాగే కూచిపూడిఅంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త ఎం సరస్వతి తల్లులకు, గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై సూచనలను ఇచ్చి ప్రతి ఒక్కరు సంబంధిలకు తల్లిపాలే అందించాలనిహితవు పలికారు..తల్లిపాల వారోత్సవాల లో భాగంగా ఆరో రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కేంద్రంలో ఎన్.ఎమ్ ఆఫ్ కూచిపూడికార్యకర్త ఆర్ నాగమణి, కేంద్ర హెల్పర్ కే. అనురాధ తల్లులు గర్భవతులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం : సర్పంచ్ అరుణకుమారి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- బాలింతల బిడ్డకు జన్మనిచ్చిన గంట తరువాత బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని ,తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని నాగాయచెరువు గ్రామ సర్పంచ్ తమ్మినేడి అరుణకుమారి అన్నారు. బంటుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు . ఈ కార్యక్రమాన్ని నాగాయచెరువు గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ తమ్మినేడి అరుణకుమారి గర్భిణీలు ,బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా తమ్మినేడి అరుణకుమారి మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాలంటే తల్లిపాలలోనే ఉందన్నారు .బిడ్డ పుట్టిన గంటలో ఆరు నెలల వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు .ఆరు నెలల తరువాత తల్లిపాలతోపాటు పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు .తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని ,దానివలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు .బాలింతలు బిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పోషకాలు పుష్కలంగా ఉండే తల్లిపాలను మాత్రమే బిడ్డకు అందించాలని వివరించారు .ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగరాజు ,గ్రామ ప్రముఖులు తమ్మినేడి శ్రీనివాస్ ,జనపాల బాలాజీ ,నాదా కళ్యాణ్ ,గ్రామ వార్డు మెంబరు చిట్టూరి మౌనిక ,అంగన్వాడీ కార్యకర్తలు ఇ ఉషారాణి ,టి ఎ ఎస్ వాణి ,ఎన్ కృష్ణకుమారి ,గర్భిణీలు ,బాలింతలు పాల్గొన్నారు .....

పొలంబడిని సద్వినియోగం చేసుకోండి : ఏడీఏ రమాదేవి

విశాలాంధ్ర-గుడివాడ : మేలైన వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులను పొందేలా రైతుల కోసం గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని గుడివాడ డివిజన్‌లో నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రమాదేవి విలేకర్లతో మాట్లాడుతూ అధిక దిగుబడులు పొందేందుకు నందివాడ పెదపారుపూడి మండలాలలో 14 వారాలపాటు రైతులకు, నిపుణులతో శిక్షణా తరగతులు కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్తమ రైతులకు సర్టిఫికెట్లను కూడా అందించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీరవెంకటసత్యనారాయణ స్వామి దేవస్థానంలో లక్ష తులసి పూజ

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక కోతి బొమ్మ సెంటర్‌లోని శ్రీ రమ సహిత వీరవెంకటసత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో లక్ష తులసి పూజ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు చక్రవర్తి ఆచార్యులు మాట్లాడుతూ స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతస్నపన, క్షీరాభిషేకం, లక్ష తులసి పూజ మహోత్సవాన్ని ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు రామకృష్ణమాచార్యులు, ట్రస్ట్ అధ్యక్షులు గుడే లక్ష్మి రంగనాయకమ్మ, ఉపాధ్యక్షుడు గుడే వెంకటేశ్వరరావు, సెక్రటరీ సిగుటూపు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ మాదాసు సురేష్‌కుమార్, ట్రెజరర్ మాదాసు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : కృష్ణానదిలోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ముంపు ప్రభావిత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు అధికంగా వస్తున్న కారణంగా కృష్ణానది లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులిచింతల ప్రాజెక్టులో ఏర్పడిన సాంకేతిక ప్రమాదం కారణంగా వరద నీరు ప్రకాశం బ్యారేజీకి వచ్చే అవకాశం ఉన్నందున నదీ ప్రవాహక లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో వరదలు హెచ్చరిక సందర్భంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారులకు తెలిపి వాటి ప్రతిపాదికన వాటిని పరిష్కరించేందుకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 3 షిఫ్టుల్లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్ పని చేస్తుందని నగర ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదల ప్రభావం కారణంగా నగరంలోని రోడ్లపై నీటి నిల్వలు, డ్రైనేజీ పైపు లైన్లు లీకులు, పైపెడ్లు, సీవరేజ్ వ్యాధులు, చెట్లు విరిగి పడిపోవుట, కొండ రాళ్లు జారిపడుట, డ్రైనేజ్లు, కాలువలు పొంగిపొర్లుటం వంటి సమస్యలను నేరుగా వాట్సాప్ నెం 8181960909, ల్యాండ్ లైన్ నెం.0866-2427485, 0866-2424172 కాల్ చేసి సమస్యలను తెలియజేస్తే కంట్రోల్ రూమ్ సిబ్బంది సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

9న క్విట్ కార్పొరేట్స్ ఆందోళన

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సామ్రాజ్యవాదుల కబంధహస్తాల నుండి వ్యవసాయరంగాన్ని పరిరక్షించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని అందులో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆగస్టు 9న పిలుపునిచ్చిన క్విట్ కార్పొరేట్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) పిలుపునిస్తోందని రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ తెలిపారు.మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా కేరళలోని వయనాడ్, హిమచల్ ప్రదేశ్ లలో సంభవించిన వరదల్లో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు.అనంతరం ఆమె మాట్లాడుతూ నేడు దేశంలో, రాష్ట్రంలో ఒకవైపు అతివృష్టి, మరోవైపు అనావృష్టి కొనసాగుతుందని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దశలో రైతాంగం విత్తనాలు, ఎరువుల ధరలు, పెట్టుబడి ఖర్చులు పెరిగి రుణభారంలో కూరుకు పోతుందన్నారు, కనీస మద్దతు ధర చట్టం కూడా చేయకుండా పాలకులు రైతాంగాన్ని నిరంతరం మోసపుచ్చుతున్నారన్నారు.రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులు ఉండగా కేవలం 50వేల మందికి మాత్రమే రుణాలు అందుతున్నాయి. కేంద్ర రిజర్వ్ బ్యాంకు ఏ విధమైన పూచీకత్తు లేకుండా రూ.1,50,000 రుణాలను నేరుగా కౌలు రైతులకు మంజూరు చేయాలని స్పష్టంగా పేర్కొంటున్నా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలేవి అమలు చేయలేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి వారికి నేరుగా రుణాలను అందించాలన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసాన్ని ప్రథమ ప్రాధాన్యతగా కల్పించాలి. పాలకవర్గాల అటవీ, పర్యావరణ విధ్వంసక విధానాల ఫలితంగా సంభవించిన కేరళలోని వయనాడ్, హిమచల్ ప్రదేశ్ ప్రకృతి వైపరీత్యాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు.రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న చిన్న సాగునీటి ప్రాజెక్టులు, చెక్ డాం లను వెంటనే పూర్తి చేయాలని, చివరి ఆయకట్టు భూముల వరకు నీరు అందించేందుకు కాలువలు నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. రిజర్వాయర్ల మెయింటెనెన్స్‌కు నిధులు విడుదల చేయాలి. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే విధానాన్ని రద్దు చేయాలన్నారు.సి-2 50 ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు.అటవీ సంరక్షణ (సవరణ) చట్టం-2023 ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలి. శ్రీశైలం ప్రాజెక్టులో అత్యంత ప్రమాద భరితంగా ఉన్న ఎప్రాన్ ను వెంటనే పూడ్చాలి. అన్ని రకాల మరమ్మత్తులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ,ఉపాధ్యక్షులు ఇల్లా రామిరెడ్డి,యువీరబాబు,షేక్ బాషా,ఎస్.లలిత,తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న వసతి గృహాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని నూతన కూటమి ప్రభుత్వం తమ ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ సంక్షేమ శాఖల సోషల్ వెల్ఫేర్,ట్రైబల్ వెల్ఫేర్,బీసీ వెల్ఫేర్ వసతి గృహముల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం సుతీల్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం సమావేశం నిర్వహించారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 26 జిల్లాలో సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలలో (కుక్, కామాటి, వాచ్‌మెన్) వంటి వారిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గత 20 సం.ల నుండి అతి తక్కువ వేతనాలతో పనిచేయున్నామన్నారు.తాము ఉద్యోగులం అనే పేరుతో ప్రభుత్వము వారి నుండి ఎటువంటి సంక్షేమ పథకాలకు అమలు చేయటం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అని చెప్పిన గత ప్రభుత్వం అమలు చేయలేదని కూటమి ప్రభుత్వం అయినా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతున్నామన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.హరి నారాయణ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాల వర్తింపచేయటంతో పాటు అమ్మఒడి ఇతర ఇతర స్కీములు అమలు చేయాలన్నారు.రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా 62 సంవత్సరాల వరకు అవకాశం కల్పించాలన్నారు. తాము రిటైర్మెంట్ అయిన తర్వాత జీవన భృతి కోసం నుమారు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇ.యస్.ఐ., ఇ.పి.ఎఫ్. వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్.హరి నారాయణ,ఎస్.జ్ఞాన శేఖర్, బి. అప్పారావు,శ్యాం ప్రసాద్, పి.వి.రమణారావు,ఎం.అప్పలనాయుడు,తది తరులు పాల్గొన్నారు.

తల్లి పాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : తల్లిపాలు శిశువునకు తొలి ఆరోగ్య టీకాలా పనిచేస్తుందని రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సౌరిబాల తెలిపారు. మంగళవారం రైల్వే ఆసుపత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్‌ను క్లోజింగ్ ది గ్యాప్ ,బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ ఫర్ ఆల్ అనే థీమ్‌తో జరుపుకుంటున్నామన్నారు.తల్లి పాల ప్రాముఖ్యత ,పంపిణీకి అమ్మతనం అవసరం అవసరం అవుతాయన్నారు. అంతర్జాతీయ, తర్జిగంగా, తల్లులందరు తల్లిపాలు ఇచ్చేలా మద్దతిచ్చే విధానం జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలను అందరూ విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎమ్.జైప్రకాష్,డాక్టర్ శరత్,డాక్టర్ డి.సీతారాం, తదితరులు పాల్గొన్నారు.